దేవతలారా రండి..

- శ్రీగిరిపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా ధ్వజారోహణ
- శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ
- నేడు స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ


ప్రధాన ఆలయంలో ధ్వజపటం ఆవిష్కరణ

శ్రీశైలం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం యాగశాల ప్రవేశంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు మార్చి 1న ముగియనున్నాయి. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి యాగశాల ప్రవేశం కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆగమశాస్త్రానుసారం బ్రహ్మోత్సవ ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు చతుర్వేద పారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించి శివసంకల్పం చేశారు. బ్రహ్మోత్సవాల సృష్టికర్త బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివ పరివార దేవతలలో ఒకరైన చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజాదికాలు జరిపారు. ఉత్సవాలను తెలియజేసేలా ప్రధాన ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. అలాగే గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ 26వ తేదీన స్వామి,అమ్మవార్ల దర్శనార్థం వస్తున్నట్లు తెలిపారు.

మిగతా 6వ పేజీలో...

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ బుధవారం ముగిశాయి. జిల్లాలో 91 పరీక్ష కేంద్రాల్లో 19,366 మంది జనరల్ కోర్సు ఒకేషనల్ కోర్సు విద్యార్థులు నమోదు చేసుకున్నారు. బుధవారం ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 526 మంది నమోదు చేసుకోగా 524 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 481 మంది నమోదు చేసుకోగా 478 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించాయి.

క్యూఆర్ కోడ్‌తో కరెంట్ బిల్లుల చెల్లింపు

- విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి

కల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఇచ్చిన బిల్లుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి సులభతరంగా విద్యుత్ బిల్లులు చెల్లించేలా ఏపీ ఎస్‌పీడీసీఎల్ అవకాశం కల్పించిందని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం.ఉమాపతి తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు బిల్లుపై ఉండే డైనమిక్ క్యూఆర్‌కోడ్‌పై స్కాన్‌చేసి సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. ముందుగా వినియోగదారు బిల్లు పేపర్ కింది భాగంలో ఉన్న క్యూఆర్ కోడ్‌పై స్కాన్‌చేయాలన్నారు. అనంతరం ఫోన్‌లో గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా బిల్ నెంబరు చిరునామాను గమనించి నగదును ఎంటర్‌చేసి పిన్ నెంబర్ ఓకే చేస్తే బిల్ పేమెంట్ క్లియర్ అవుతుందని ఎస్ఈ వివరించారు. జిల్లా పరిధిలోని కర్నూలు టౌన్, ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్లలో విద్యుత్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి వంద శాతం బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పల్లె మురిసింది!

- జిల్లాలో రూ.131.28 కోట్లతో గోకులాలు..
- ఫారం పాండ్లు, ఉద్యాన తోటల పెంపకం, సీసీ రోడ్ల నిర్మాణం
- రైతుల నికర ఆదాయం పెరిగే మార్గాలు
- పల్లె పండుగతో గ్రామాలకు ప్రగతి కళ..!

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పల్లెలకు పూర్వ వైభవం వస్తోంది. గ్రామాభివృద్ధి మెరిసిపోతోంది. పల్లె పండుగతో ఊరూరా హర్షాతిరేకాలు వెల్లి విరుస్తున్నాయి. పల్లె సీమల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. పల్లె సీమలలో గోకులాలు, ఉద్యాన పండ్ల తోటల పెంపకం, ఫారం పాండ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉపాధి హామీ పథకం ద్వారా కర్నూలు జిల్లాలో రూ.131.28 కోట్లతో ఈ పనులకు కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేశారు. డ్వామా, పంచాయతీరాజ్ శాఖలను సమన్వయపరిచి గ్రామీణ ప్రాంతాల్లో రైతుల జీవన ప్రమాణాలు, నికర ఆదాయ మార్గాల పెంచే కార్యక్రమాలు ముమ్మరం చేశారు.

కల్లూరు తడకనపల్లి గ్రామంలో రూ.2.30 లక్షల విలువ గల గోకులం షెడ్డును 90 శాతం రాయితీతో నిర్మించుకున్న పాడి రైతు ఎస్. మహబూబ్ బాషా



రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల ప్రయోజనార్థం గోకులం నిర్మాణాలను చేపట్టింది. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు తమ స్థలం అనుకూలతను బట్టి గోకులం నిర్మాణానికి రెండు పశువులు ఉన్న వారికి యూనిట్ ధర రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులు ఉన్న వారికి రూ.2.30 లక్షలు ఉపాధి మెటీరియల్ నిధులు మంజూరు చేశారు. ఇందులో కేవలం రైతులు 10 శాతం భరించగా.. మిగిలిన 90 శాతం ఉపాధి నిధుల నుంచి మజూరు చేశారు. అదే విధంగా 20 గొర్రెలు, మేకలకు షెడ్లు వేసుకునే వారికి యూనిట్ ధర రూ.1.30 లక్షలు, 50 గొర్రెలు, మేకలు కలిగిన వారికి రూ.2.30 లక్షలు, అలాగే కోళ్ల ఫారాలకు 100 కోళ్లు పెట్టుకున్న వారికి షెడ్డు నిర్మాణానికి ఒక యూనిట్ కు రూ.87వేలు, 200 కోళ్లు ఉన్న వారికి రూ.1.32 వేలు మంజూరు చేశారు. మేకలు, గర్రెలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీతో ఉపాధి నిధులను మంజూరు చేశారు. జిల్లాలో మొత్తంగా 1020 షెడ్ల నిర్మాణానికి రూ.21.92 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే 605 షెడ్లు నిర్మాణం పూర్తికాగా, మిగిలినవి తుదిదశలో ఉన్నా యి.

ఫారం పాండ్లు, ఉద్యాన తోటల పెంపకం

జిల్లాలో రూ.4.5 కోట్ల అంచనాతో 1252 ఫారంపాండ్లు మంజూరు కాగా, 274 పనులు చేపట్టి ఇప్పటికే 53 పనులను పూర్తి చేశారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. సన్న చిన్నకారు రైతులు సుస్థిర అభివృద్ధి కోసం రూ.37.36 కోట్ల అంచనాలతో 4152 ఎకరాలలో 100 శాతం రాయితీతో మామిడి, సపోటా, చీని, నిమ్మ తదితర పండ్ల తోటల పెంపకం పనులు చేపట్టి పూర్తి చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఉపాధి హామీ నిధులతో రూ.67.58 కోట్లతో గ్రామాల్లో సిమెంటు రహదారులు, బీటీ రహదారులు, డబ్ల్యూబీఎం రహదారులు, ప్రహరీల నిర్మాణం తదితర 830 పనులలో 790 పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు త్వరలో పూర్తి కానున్నాయి.

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధి:

జిల్లాలో గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులను ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తోంది. గోకులం నిర్మాణాలు, ఫారం పాండ్స్, ఉద్యాన తోటల పెంపకం, సీసీ రోడ్లు తదితర పనులను చేపట్టారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనుల కల్పన ద్వారా ఇప్పటి వరకు వేతనాల రూపంలో రూ.211 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.73 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతో పాటు రైతుల నికర ఆదాయ మార్గాల పెంపుదల దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

చాలా సంతోషంగా ఉంది

మాకున్న మూడెకరాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి పండ్ల మొక్కలు నాటడానికి గుంతలు తీయించారు. ప్రభుత్వం వారే మొక్కలను, ఎరువులను సరఫరా చేశారు. మా పొలాన్ని దున్నుకోవడానికి ఎకరాకు రూ.1000 చొప్పున నగదును కూడా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

- చాకలి సుంకన్న రైతు పొట్లపాడు గ్రామం, దేవనకొండ మండలం



మా గ్రామంలో సీసీ రోడ్లు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రహదారులను నిర్మించి గ్రామాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. మా గ్రామంలో బోయ మద్దిలేటి ఇంటి నుంచి మసీదు వరకు సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డు వేయడం వల్ల చాలా సౌకర్యంగా ఉంది.

- రఘురాముడు, ఓర్వకల్లు

మినీ గోకులం పాడి రైతులకు వరం



మా సొంత స్థలంలో 6 పశువులకు మినీ గోకులం నిర్మించుకున్నా. యూనిట్ విలువ రూ.2.30 లక్షలు కాగా ఉపాధి హామీ పథకం కింద90 శాతం సబ్సిడీతో రూ.2.07 లక్షలు మంజూరు చేశారు. రూ.23 వేలు రైతు వాటా కింద జమ చేసి మినీ గోకులం నిర్మాణ పూర్తి చేశాను. ఇది నాకు ఒక వరం లాంటిది.

- ఎస్. మహబూబ్‌బాషా, తడకనపల్లి గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు

కరువు మండలాల్లో 150 రోజుల పని దినాలు

- డ్వామా పీడీ వెంకట రమణయ్య

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఎంపిక చేసిన కరువు మండలాల్లో 150 రోజుల పనిదినాలకు కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపిందని డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో ఖరీఫ్‌లో కరువు పరిస్థితులు నెలకొనడం వల్ల ఆ మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు జాబితాలో చేర్చిందన్నారు. దీంతో ఈ రెండు మండలాల్లోని రైతులు వ్యవసాయ కూలీలకు నూరు రోజుల పనిదినాలు కాకుండా మరో 50 రోజులు అదనంగా పనులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. మార్చి నాటికి జిల్లాలోని అన్ని మండలాల్లో పూర్తి స్థాయిలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పూడికతీత చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు, అదే విదంగా రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకం తదితర కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. దీని వల్ల లక్ష మంది దాకా రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి దక్కుతుందని తెలిపారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ఎస్ఓపీ (స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్) ప్రకారం పొరపాట్లకు తావు లేకుండా రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు నిర్వహణపై రెవెన్యూ సర్వే సిబ్బందికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కింద ప్రతి మండలంలో ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద రీసర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు నిర్వహణపై రెవెన్యూ, సర్వే సిబ్బందికి డివిజన్ స్థాయిలో కూడా శిక్షణ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ జిల్లాలో పైలట్ 25 గ్రామాలుగా ఎంపిక చేసుకుని రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ 25 గ్రామాల్లో గ్రామ సరిహద్దులను ఏర్పాటు చేశామని, పత్తికొండ డివిజన్‌లో ఐదు గ్రామాల్లో బ్లాక్ బౌండరీ చేయలేదని, బ్లాక్ బౌండరీని రెండు రోజుల్లో పూర్తి చేయాలని పత్తికొండ డీఐఎస్‌వోను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ఫార్మసీ ఆఫీసర్ల ప్రొవిజనల్ లిస్టు విడుదల

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు కడప-4 పరిధిలోని ఫార్మసీ ఆఫీసర్ల ఉద్యోగాలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను Http://cfw.a-p.gov.in వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు కడప ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై అభ్యర్థులు తమ అభ్యంతరాలను కడప ఆర్డీకి స్వయంగా వచ్చి తెలియజేయాలన్నారు. అభ్యర్థనలను ఈ నెల 18 నుంచి 22 వరకు స్వీకరిస్తామని వెల్లడించారు. ఫైనల్ మెరిట్ జాబితాను ఈ నెల 28వ తేదీ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ప్రజాధనం నీళ్లపాలు!

- వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం
- ఆర్వో ప్లాంట్లు పేరుతో.. రూ. కోట్ల ఖర్చు
- పనిచేయని నీటి శుద్ధి యంత్రాలు
- వేసవిలోగా కూటమి ప్రభుత్వం స్పందించేనా?

ఆంధ్రజ్యోతి విజిట్



ఇక్కడ కనిపిస్తున్నది నంద్యాల మండలం భీమవరం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ (ఆర్వో ప్లాంట్). గత ఏడాది నుంచి పనిచేయడం లేదు. మనబడి.. మన భవిష్యత్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో నేటికి నిరూపయోగంగా ఉంది. విద్యార్థులు బోరింగ్ నీరు తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. అదేవిధంగా పోన్నాపురం ప్రభుత్వ పాఠశాలలో కూడా వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలోని ఆర్వో ప్లాంట్లను పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నంద్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో గత వైసీపీ సర్కార్ నాడు- నేడు కింద రూ.కోట్లు ఖర్చు చేసి పలు ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి ఆర్వో ప్లాంట్లును ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వాటి నిర్వాహణను గాలికి వదిలేసింది. ఖరీదైన పరికరాలు సైతం మరమ్మతులకు చేరి నిరూపయోగంగా మారాయి. తద్వారా ఆయా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఓ మూలకు చేరి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇక విద్యార్థులు చేసేదేమీ లేక ఇళ్ల నుంచి బాటిళ్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో చేతిబోరు నీటినే తాగాల్సిన గత్యంతర పరిస్థితి ఏర్పడింది. ఆర్వో ప్లాంట్లు నిర్వహణపై గత ప్రభుత్వ తీరు మూన్నాళ్ల ముచ్చగానే మారింది. గత వైసీపీ పాలకుల నిర్వాకంతో.. విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమైంది. వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లను మరమ్మతులు చేసి వినియోగం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,352 ప్రభుత్వ పాఠశాలల్లో 1,45,517మంది విద్యను అభ్యసిస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఎక్కువ శాతం ఆర్వో ప్లాంట్‌లు కూడా పనిచేయకపోవడంతో దిక్కులేక.. కొళాయి నీరు, చేతిపంపులను ఆశ్రయిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలని సుమారు రూ.3 కోట్లకుపైగా నాడు- నేడు కింద ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్లును ఏర్పాటు చేసి మమ అనిపించేశారు. కానీ ఆచరణలో మాత్రం ఆశించిన స్థాయిలో పెట్టలేకపోయింది. ఎక్కడ చూసినా ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు చేరి పనికిరాకుండా పోయాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 357 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 177 మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన 180 మాత్రం ఏళ్ల తరబడి పనిచేయడం లేదని అధికార లెక్కలు చెబుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది.

ఏళ్ల తరబడి మూలనపడ్డ ఆర్వో ప్లాంట్లు

గత జగన్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు నాణ్యతలోపంగా ఉండటంతో ఎక్కువ కాలంలో పనిచేయలేదు. 70 శాతం పనిచేయకపోవడంతో పలుమార్లు ఆయా ఏజెన్సీలతో పాటు అధికారులకు సంబంధిత యాప్ ద్వారా ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఫిర్యాదు చేసినా ఏమాత్రటి పట్టించుకోలేదు. చివరికి విద్యార్థుల కష్టాలు చూడలేక.. కొందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చారు. మరికొన్ని ఏజెన్సీలకు ఇప్పటికీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా సర్వీసింగ్ చేయడం లేదు.



డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండల పరిధిలోని గుడిపాడు ప్రాథమిక పాఠశాలలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు చేరి నిరూపయోగంగా దర్శనమిస్తోంది. ఇక్కడ 60 మంది విద్యార్థులు ఉన్నారు. ఆర్వో ప్లాంట్ ఉన్నా.. పనిచేయక పోవడంతో ఇంటి వద్ద నుంచి నీరు తెచ్చు కోవాల్సిన దుస్థితి. ప్యాపిలి మండల పరిధిలో నాడు- నేడు కింద గత ప్రభు త్వం 30 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిలో సగానికి పైగా పని చేయడం లేదు. దీంతో ఏళ్ల తరబడి విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

మిగతా 6వ పేజీలో..

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి విజిట్

ప్రజాధనం.. నీళ్ల పాలు!

మంత్రి బీసీ ఇలాకాలో...



బనగానపల్లి మండలంలో గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో -10, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో-10 చొప్పున మొత్తంగా 20 పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలు, బాలికల ఉన్నత పాఠశాలు, నందవరం నందివర్గం, పలుకూరు రామతీర్థం, ఇల్లూరు కొత్తపేట, టంగుటూరు, బనగానపల్లె మోడల్ స్కూల్, కస్తూర్బా, ఏపీ గురుకుల పాఠశాలలతో పాటు మిగిలిన ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లు ఎక్కడా పనిచేయడం లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు కొళాయినీరు తాగుతుండగా.. మరి కొన్ని పాఠశాలల విద్యార్థులు ఇంటి వద్ద నుంచే తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రిగా కొనసాగుతున్న బీసీ జనార్దన్ రెడ్డి చొరవ తీసుకుని తాగునీటి ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

● బండి ఆత్మకూరు మండలం పరిధిలో 9 ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది. ఆయితే ఆ మిషన్లు ఎక్కువ కాలం పనిచేయకపోవడంతో మరమ్మతులకు చేరాయి. మండలంలోని పార్నపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 74 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ తాగునీటి వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటుండగా.. కొన్ని సార్లు ప్లాస్టిక్ బిందెలతో తాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 8 పాఠశాలల్లో కూడా సదరు వాటర్ ప్లాంట్‌లు పనిచేయడం లేదు.



● రుద్రవరం మండలం పేరూరు ప్రాథమిక పాఠశాలలో గత మూడేళ్లుగా గత ప్రభుత్వం అమర్చిన తాగునీటి వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు గురై అటకెక్కింది. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మూలకు ఉంచారు. ఇక్కడ 61 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల కష్టాలు చూడలేక.. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి ప్లాస్టిక్ క్యాన్‌లో నీటిని తెచ్చిపెడుతున్నారు. ఇవీ సరిపోక కొందరు ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు.





● డోన్ పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1,747 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద ఇక్కడ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. రెండేళ్ల నుంచి పనిచేయకపోవడంతో తాగునీరు లేక.. బోరు నీరు తాగలేక.. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా మరుగుదొడ్డు కూడా సక్రమంగా లేకపోవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంది.

● మహానంది మండలంలో నాడు-నేడు కింద గత వైసీపీ ప్రభుత్వం ఏడు పాఠశాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. గోపవరం, గాజులపల్లి, బుక్కాపురం, బొల్లాపురం ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్లాంట్ గత ఏడాది నుంచి పనిచేయడం లేదు. చేసేదీ లేక కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. మరికొందరు బయట ప్రాంతాల్లో కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. అధికార లెక్కల ప్రకారం ఏడు వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. వాటిలో నాలుగు మరమ్మతులకు చేరాయి.





● శ్రీశైలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత ప్రభుత్వం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. అయితే గత ఏడాది నుంచి పనిచేయడం లేదు. దీంతో కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటుండగా.. మరికొందరు విద్యార్థులు బోరింగ్ నీరు తాగాల్సిన దుస్థితి.



● శిరివెళ్ల మండలం యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 610 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతిరోజు 550 మందికిపైగా విద్యార్థులు మధ్యాహ్నం భోజనం ఇక్కడే చేస్తుంటారు. ఏడాది నుంచి ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు పాఠశాలలోని బోరు నీటినే తాగుతున్నారు. కొందరు విద్యార్థులు బోరు నీరు తాగలేక.. ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. గత ప్రభుత్వం శిరివెళ్ల మండల పరిధిలో 16 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయగా.. యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మెయిన్ ప్రాథమిక పాఠశాల, గుండంపాడు, మహాదేవపురం మెయిన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయలేదు.

● ఫిర్యాదు చేసినా మెకానిక్ రావడం లేదు



మూడేళ్ల నుంచి జూపాడు బంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎలాంటి నిధులు రాలేదు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఏజెన్సీ మెకానిక్ కూడా స్పందించలేదు. చివరికి చేసేది నేనే స్వయంగా రూ.15 వేలు ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్‌కు రిపేరీ చేయించాను. ఆ తర్వాత కూడా కొన్ని నెలలు పనిచేసి తర్వాత చెడిపోయింది. దీంతో విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. మా పరిధిలోని కొన్ని పాఠశాలల్లో కూడా ఇదే తరహా సమస్య ఉండటంతో ఉపాధ్యాయులే డబ్బులు వెచ్చించి చేయించుకునే పరిస్థితి ఏర్పడింది.

- చిన్న మద్దిలేటి, ఎంఈఓ, జూపాడుబంగ్లా

● జూపాడుబంగ్లా మండలంలో నాడు-నేడు కింద గత వైసీపీ ప్రభుత్వం 13 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది. ఆయితే ఒక్కటి కూడా పనిచేయలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలన చేయగా.. ఆర్వో ప్లాంట్‌ను ఓ మూలన పడేశారు. రెండేళ్ల నుంచి పని చేయలేదు. ఇక్కడ 537 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో ట్యాంకు ద్వారా సరఫరా చేసే నీటిని విద్యార్థులు తాగాల్సిన దుస్థితి. కొందరు విద్యార్థులు ట్యాంకు నీళ్ల తాగి.. అనారోగ్యం పాలు కావడంతో కొందరు ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నామని వాపోయారు.



● ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోవడం వాస్తవమే



జిల్లాలో చాలా వరకు ఆర్వో ప్లాంట్లు పనిచేయని విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఇదివరకే ఉన్నతాధికారులకు నివేదించాం. అతి త్వరలోనే ఆర్వో ప్లాంట్లుకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేలా చూస్తాం. సదరు ఏజెన్సీలకు గత ప్రభుత్వం బిల్లులు పెండింగ్‌తో మరమ్మతులు చేయలేదని తెలిసింది.

-ఎస్.ప్రేమంత్‌కుమార్, ఏసీపీ, సమగ్రశిక్ష

అంగన్‌వాడీలకు గుడ్ న్యూస్



గత వైసీపీ పాలనలో రోడ్డెక్కిన అంగన్‌వాడీలు (ఫైల్)

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ చెల్లింపునకు ముందుకొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు దాదాపు నెలరోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఉద్యోగ విరమణ చేసినరోజునే గ్రాట్యుటీ చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం గ్రాట్యుటీ అమలుపై అడుగులు వేయనుంది. దీనిపై అంగన్‌వాడీలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీల సర్వీసుల ఆధారంగా గ్రాట్యుటీ లెక్కించి ఇవ్వనున్నారు. ఎన్ని సంవత్సరాలు సర్వీస్ ఉంటే అందులో ప్రతి ఏడాదికి 15రోజుల వంతున వేతనం చెల్లిస్తారు. నంద్యాల జిల్లాలో 6 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో అంగన్‌వాడీ కార్యకర్తలు 1,606, ఆయాలు 1,584 మొత్తం 3,190 మంది పనిచేస్తున్నారు. వీరిలో 20నుంచి 30ఏళ్లుగా పనిచేస్తున్నవారు ఉన్నారు. వీరు అందుకుంటున్న వేతనం ప్రకారం లెక్కిస్తే సరాసరి రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షలకుపైగా గ్రాట్యుటీ అందుకునే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు రూ.11,500, ఆయాలు రూ.7వేలు చొప్పున వేతనాల అందుకుంటున్నారు.

డ్రిప్పు సేద్యం సబ్సిడీ ఖరారు

- ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం
- మిగతా రైతులకు 90 శాతం
- ఉమ్మడి జిల్లాలో 15వేల హెక్టార్లలో డ్రిప్పు ఏర్పాటు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ సాగునీటి పథకం కింద డ్రిప్పు, తుంపర్ల పరికరాలను అమర్చేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం సబ్సిడీని ఖరారు చేసిందని కర్నూలు జిల్లా ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించి వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడిప రాజశేఖర్ పంపిన ఉత్తర్వులు బుధవారం తమ కార్యాలయానికి అందినట్లు పీడీ తెలిపారు. ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ, సన్న చిన్నకారు రైతులకు వంద శాతం సబ్సిడీపై పరికరాలు అందుతాయన్నారు. దీని వల్ల రైతులందరికీ బోరుబావులు ఉన్న వారికి వంద శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీయేతర సన్న చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ (గరిష్ఠంగా 2.18 లక్షలు) ఉంటుందని, అదే విధంగా ఉమ్మడి జిల్లాలో 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులతో పాటు గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీ (3.14 లక్షలు) ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే అన్ని సామాజిక వర్గాలకు చెందిన ఐదెకరాల్లోపు సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం (రూ.19 వేలు), 12.5 ఎకరాల్లోపు పొలం కలిగిన ఇతర సామాజికవర్గాలకు 50 శాతం చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నట్లు పీడీ ఉమాదేవి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15వేల హెక్టార్లకు డ్రిప్పు పరికరాలను ఈ ఆర్థిక సంవత్సరం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీడీ తెలిపారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటుతున్న నేపథ్యంలో డ్రిప్పు, తుంపర్ల సేద్యం కలిగిన రైతులకు పంట చేతికొచ్చేవరకు పూర్తి స్థాయిలో నీటిని ఉపయోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

విక్రమ సింహపురి వీసీగా నంద్యాల వాసి

● విద్యాభ్యాసం అంతా పాణ్యంలోనే.. ●అల్లం శ్రీనివాసరావు ఎంపికపై హర్షం



పాణ్యం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని విక్రమసింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నంద్యాలకు చెందిన అల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పలువర్సిటీలకు వీసీలను నియమించింది. అందులో విక్రమసింహపురి వర్సిటీకి నంద్యాలకు చెందిన అల్లం వెంకటలక్ష్మమ్మ, వెంకటయ్య కుమారుడు అల్లం శ్రీనివాసరావును ఎంపిక చేశారు. శ్రీనివాసరావు తండ్రి వెంకటయ్య వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కావడంతో ఆయన నంద్యాల, పాణ్యం ప్రాంతాల్లో పనిచేశారు. అల్లం శ్రీనివాసరావు ఐదో తరగతి పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లెలో చదివారు. అనంతరం 1981-82 పదవ తరగతి పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ కోర్సును పూర్తి చేశారు. ఇంటర్ అనంతరం శ్రీనివాసరావు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీలో హెచ్‌ఓడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు 250 అంతర్జాతీయ ప్రచురణలు, 25 మందికి పీహెచ్‌డీలు అందజేశారు. కేఎల్ వర్సిటీలో 15 సంవత్సరాలు, ఢిల్లీలో 13 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. డీటీయూలో ఏడుసార్లు తన పరిశోధనలకు అవార్డు అందుకున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత శాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన ప్రపంచ టాప్-2 పర్సెంట్ శాస్త్రవేత్తల జాబితాలో వరుసగా నాలుగోస్థానం దక్కించుకున్నారు. ఢిల్లీ టెక్నలాజికల్ విశ్వ విద్యాలయంలో తన పరిశోధనలకు గాను వరుసగా ఏడుసార్లు కమెండబుల్ రీసెర్చ్ అవార్డును అందుకున్నారు. కేఎల్ వర్సిటీలో ఉత్తమ ప్రొఫెసర్‌గా వరుసగా మూడుసార్లు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు కౌలూరుకు చెందిన ఆర్జీఎం కళాశాల ఉద్యోగి సుబ్బరాయుడు, పాణ్యంకు చెందిన తెనాలి మున్సిపల్ కమిషనర్ శేషన్న, కొనిదేడుకు చెందిన వాసవీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ రమణారెడ్డిలు మాట్లాడుతూ తమతో పాటు చదివిన మిత్రుడు సింహపురి యూనివర్సిటీకి వీసీగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. శ్రీనివాసరావు చిన్నతనం నుంచే చలాకీగా ఉంటు, విద్యలో అందరికంటే ముందు ఉండేవారన్నారు.

మరింత బాధ్యత పెంచింది : అల్లం శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వం నన్ను గుర్తించి వీసీ పదవికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. వీసీ పదవి ఎంపికతో తనపై మరింత బాధ్యతలు పెరిగాయి. ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి విక్రమసింహపురి యూనివర్శిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా. విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించి, వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తా.

అరసం పుస్తక సంకలనాలకు

కథలు, కవితల ఆహ్వానం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయిత సంఘం (అరసం) జిల్లా శాఖ కథలు, కవితలకు ఆహ్వానం పలుకుతోంది. ఔత్సాహిక సాహితీవేత్తలను ప్రోత్సహించే క్రమంలో అరసం ముద్రించనున్న 'కర్నూలు కవిత-2', 'కర్నూలు కథలు' పుస్తక సంకలనాలకు జిల్లాకు చెందిన కవులు, రచయితల నుంచి కవితలు, కథలు ఆహ్వానిస్తున్నట్లు గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.హరికిషన్, నగర అధ్యక్ష కార్యదర్శులు రాణి లీలావతి, జీవీ ప్రమోద్ చక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు. రచనలు సామాజిక అంశాలను ప్రతిబింబించేలా ఉండాలని, కులాలను, మతాలను విమర్శించకుండా అభ్యుదయ కోణాన్ని తెలియజేసే విధంగా ఉండాలని తెలిపారు. కవితలు, కథలు గతంలో ఇతర పత్రికల్లో ప్రచురితం కాలేదని, అలాగే ప్రసార సాధనాల్లో రాలేదని హామీపత్రంతో తమ రచనలు పంపుకోవాలని వారు సూచించారు. కవితలు 25 లైన్లకు మించకుండా ఉండాలని, కథలు ఐదు పేజీలకు మించకుండా రాయాలని తెలిపారు. కథలు, కవితలు డాక్టర్ ఎం.హరికిషన్ సెల్ నెంబరు 94410 32212, రాణి లీలావతి సెల్ నెంబరు 7013114708లకు వాట్సాప్ ద్వారా పంపించాలని తెలిపారు. కవులు, రచయితులు తమ కథలు, కవితలను 2025 మార్చి 15లోగా పంపాలని అరసం కార్యదర్శి జీవీ ప్రమోద్ చక్రవర్తి తెలిపారు.



స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న శ్రీకాళహస్తి డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

దేవతలారా రండి..

(5వ పేజీ తరువాయి)



శ్రీకాళహస్తి నుంచి పట్టువస్త్రాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు బుధవారం రాత్రి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి దేవస్థానం పట్టువస్త్రాలను సమర్పించింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం తరపున డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ పట్టువస్త్రాలను అందజేశారు. ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీకళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో సంప్రదాయ నృత్యప్రదర్శన, వేనుగానం, భక్త మార్కండేయ నాటకం కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు భృంగివాహన సేవ : బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామి, అమ్మవార్లు భృంగివాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- 25 నుంచి మార్చి 2 వరకు వేడుకలు: మల్లెల రాజశేఖర్



కాల్వబుగ్గలో కోనేటిని పరిశీలిస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం కాల్వబుగ్గ రామేశ్వరస్వామి మహాశివరాత్రి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రెండు కోనేరులను బోరు నీటి ద్వారా నింపామన్నారు. మహిళలకు స్నానపు ఘట్టాలు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఎండలు దృష్టిలో పెట్టుకుని ఆలయ ప్రాంగణంతో టెంట్లతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, 30వేల మజ్జిగ ప్యాకెట్లు, 30వేల వాటర్ ప్యాకెట్లు భక్తులకు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈవో మద్దిలేటి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, భక్తులు బజారు, గువ్వ రవికుమార్, వేణు, చిన్న నాగరాజు, మాజీ ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.29 కోట్లు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మంత్రాలయం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,29,15,105లు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, సురేష్ కోణాపూర్ తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలలో 28 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘాలో లెక్కించినట్లు తెలిపారు. రూ.3,29,15,105 నగదుతో పాటు 1280 గ్రాముల వెండి, 58.150 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. వచ్చిన నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, జేపీస్వామి, రవిస్వామి, కృష్ణమూర్తి, దేశాయ్ నరసింహమూర్తి, గిరిధర్ పాల్గొన్నారు.

ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల్లో గందరగోళం

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ, హెల్త్ కార్యదర్శులు పదోన్నతుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఈ నెల 17వ తేదీ అధికారులు ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల ఖాళీల జాబితాను విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో దాదాపు 100 ఖాళీలు ఉన్నట్లు జాబితా విడుదల చేశారు. ఈ జాబితాలో పూర్తి స్థాయి వెకెన్సీలను చూపించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రోజుల క్రితం కొందరు ఏఎన్ఎంలు నేరుగా డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కర్నూలు సమీపంలోని లద్దగిరి పీహెచ్‌సీలోని అమడకుంట్ల, లద్దగిరి గోనెగండ్ల పీహెచ్‌సీలోని హెచ్‌కైరవాడి, వెలుగోడు, గోనెగండ్ల, పోలకల్ పీహెచ్‌సీలోని నాగలాపురం గుడిపాడు, జులేకల్, కల్లూరు పీహెచ్‌సీలో సల్కాపురం, బొల్లవరంతో పాటు డైవందిన్నె పీహెచ్‌సీలో ఎర్రకోట, నందవరం పీహెచ్‌సీలో ముగతి, దేవనకొండ పీహెచ్‌సీలో కొన్ని చూపించలేదని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఖాళీల వివరాలను స్పష్టత ఇస్తూ ప్రకటన చేయాలని కోరుతూ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. పొజిషన్ ఐడీ లేనందు వల్ల వాటిని పూర్తి చేస్తే జీతాలు రావని, అలాంటి సమస్యలు ఉంటే సంబంధిత మెడికల్ ఆఫీసర్ల ద్వారా పంపించాలని ఉన్నతాధికారులు తెలిపారు.

లబ్ధిదారుల జాబితాలో మీ పేరు ఉంది

- రూ.12 వేలు చెల్లిస్తే ప్రభుత్వం స్కూటర్ ఇస్తుంది
- దివ్యాంగులను మోసం చేసిన ఓ మహిళ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న దివ్యాంగులు

మద్దికెర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల జాబితాలో మీ పేరు ఉందని, రూ.12 వేలు చెల్లిస్తే రూ.80 వేలు విలువ చేసే స్కూటర్‌ను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పి ఓ మహిళ దివ్యాంగులను బురిడీ కొట్టించింది. ఈ ఘటన మద్దికెర మండలంలో జరిగింది. వివరాలివి.. ఓ మహిళ 9052126738 నెంబర్ నుంచి రామకృష్ణ, శ్రీలక్ష్మి, ఆదిలక్ష్మిలతో పాటు మరో 8 మందికి ఫోన్ చేసింది. ప్రభుత్వం స్కూటర్ ఇస్తుందని, రూ.12 వేలు చెల్లిస్తే రూ.80వేలు విలువ చేసే ద్విచక్రవాహనం అందజేస్తారని చెప్పారు. చెప్పిన మొత్తం చెల్లించకపోతే ఇతరులకు మంజూరవుతాయని చెప్పారు. దీంతో ఈ నెల 18న ఒకరు రూ.6,300, మరొకరు రూ.6,300, మరొకరు రూ.10వేలు... బుధవారం ఒకరు రూ.3వేలు, మరొకరు రూ.3వేలు 9642076467, 6364506562 నెంబర్లకు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించారు. అనంతరం సరిగా స్పందన లేకపోవ డంతో మోసపోయామని భావించిన దివ్యాంగులు బుధవారం ఎస్ఐ విజయకుమార్ నాయక్‌ను ఆశ్రయించారు. విభిన్న ప్రతిభావంతుల నాయకులు వీరాంజనేయులు, అంజనేయులు, మల్లికార్జున, ప్రసన్నరాణి, తదితరులు ఉన్నారు.

ఆలయ ఉద్యోగికి మెమో

మహానంది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ అనూరాధ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో బుధవారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మెమో జారీ చేశారు. ఇటీవల ఆ ఉద్యోగిని విధులు నిర్వహించే ప్రసాదాల విక్రయ కేంద్రం వద్ద తనతో పాటు నిబంధనలకు విరుద్ధంగా కుమారుడు విధులు నిర్వహించడంపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ఈవో ఆ ఉద్యోగికి మెమో జారీ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గడివేముల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిమద్దెల గ్రామ సమీపంలోని కేసీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వివరాలివీ.. 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి ఐదారు రోజుల క్రితం కిందట మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతుడి కుడిచేతి మీద తెలుగులో వెంకటేశ్వర్లు అనే పచ్చబొట్టు ఉందని, ఒంటిపై బ్రౌన్‌కలర్ టీషర్టు, బ్లూకలర్ షార్ట్ ఉన్నట్లు ఆయన తెలిపారు. కరిమద్దెల వీఆర్వో సయ్యద్ చిన్న ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గడివేముల పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

రాయలసీమ వర్సిటీలో మార్పులు తీసుకొస్తా

- ప్రతి ఫ్యాకల్టీలో బోధనకు ప్రాధాన్యం
- ఆర్‌యూ కొత్త వీసీగా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ వి. వెంకట బసవరావు





బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి పరిచే క్రమంలో సమూల మార్పులు తీసుకొస్తానని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. బాధ్యతలు ఇచ్చేముందు ప్రత్యేకంగా కొన్ని టార్గెట్స్ సూచించి ఇక్కడికి పంపారని అన్నారు. ఆ దిశగా పని చేసేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకున్నా అని అన్నారు. బుధవారం వీసీగా బాధ్యతలు తీసుకున్న ఆయన ఆంధ్రజ్యోతితో కాసేపు ముచ్చటించారు.

ఉన్నత విద్యామండలి ఏమైనా మార్గదర్శకాలు ఇచ్చిందా..?

జవాబు: మంత్రి లోకేష్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం పాలన గాడి తప్పింది. దాన్ని దారిలో పెట్టాలని చెప్పారు. సమస్యలను పరిష్కరించుకుంటా.. లేని పక్షంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఎక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచించి ఉన్నత విద్యామండలిలో చర్చించి ప్రతి అంశాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా.

ఆర్‌యూలో చదువే లేదనే అభిప్రాయం ఉంది కదా?

జవాబు: అవును. చదువు లేదు .. అన్న ఈ వర్సిటీలో చదువు ప్రతి విద్యార్థికి అందేలా చూసి ఆ పేరును చెరిపేస్తాను. విశ్వవిద్యాల యంలో ఉన్నత విద్యకు పెద్ద పీట వేస్తా.. ఇప్పటి వరకు బోధన సిబ్బంది ఏం చేస్తున్నదీ తెలుసుకొని, ఇంకేం చేయాలో సూచిస్తా.

ఇక్కడ పదవులను కాపాడుకోవడమే లక్ష్యమైందనే అపవాదు ఉంది. ఎలా మారుస్తారు?

జవాబు: వాస్తవమే. ఇక్కడ పనిచేసిన ప్రొఫెసర్లు పదవులు కాపాడవడే లక్ష్యంగా ఉన్నారని, క్లాస్‌లకు వెళ్లడం లేదనీ ఫిర్యాదులు ఉన్నాయి. ఇకపై చదువుకు ప్రాధాన్యత ఇచ్చేలా వారిలో ప్రవర్తన తెచ్చేందుకు అవసరమైన తీరులో వారికి టార్గెట్లు నిర్దేశించి, ప్రతి విద్యార్థి చదువుకునేలా చూస్తా..! నిత్యం 10 నుంచి 20 మంది విద్యార్థులకు ఒక మెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా ఉత్తమ విద్యను అందిస్తా..

విద్యలో ఎలాంటి టార్గెట్లు పెట్టబోతున్నారు?

జవాబు: న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ లక్ష్యంగా పని చేస్తాం. అప్పుడే దేశ, ప్రపంచ స్థాయిలో మన రాయలసీమ యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతులు వస్తాయి. ఎక్కువ శాతం ఫ్యాకల్టీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉండటం వల్ల ప్రొఫెసర్ల స్థాయిలో వారు చొరవ తీసుకోవడం లేదు. ఈ తేడా లేకుండా చూసి విద్యలో మంచి ప్రావీణ్యం ఇచ్చేలా ఉన్నత విద్యమండలితో ప్రస్తావించి అవసరమైన చర్యలు తీసుకుంటా.

ఒక విద్యార్థే ఉన్న కోర్సుల మాటేంటి ?

జవాబు: ఎకనమిక్స్ విభాగంలో ఒక్క విద్యార్థి ఉన్నారు. ఎందుకు ఈ సమస్య ఉందో తెలుసుకుంటా. పీజీ కోర్సుల్లో 19 విభాగాల్లో కేవలం 360 మంది విద్యార్థులే ఉన్నారు. కొన్ని కోర్సులకు జీరో అడ్మిషన్లు ఉన్నాయని తెలిసింది. వాటిపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటా.

ఆర్‌యూ అంటేనే చెడ్డపేరు ఉంది. దాన్ని ఎలా అధిగమిస్తారు..?

జవాబు: రాయలసీమ యూనివర్సిటీ అంటేనే నిత్యం, దాడులు, ధర్నాలు, ఆందోళనలు, రాజకీ యాలు ఉన్నాయనే అపవాదు ఉంది. చదువుకు ప్రాధాన్యమిస్తే ఇవి వాటంతట అవే సర్దుకుంటాయి. ప్రతి అంశాన్ని సున్నితంగా పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తా.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం
- నిరంతరం ఉచిత దర్శనం
- లక్ష లడ్డులు సిద్ధం
- మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



మహానంది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహానందిలో 8 రోజుల పాటు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపా రు. బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాం తాల నుంచి వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టుగానే సకల సదుపాయాలు కల్పించనున్నట్లు ఈవో తెలిపారు. అన్ని శాఖల సమన్వయ కృషితో ఉత్సవాలను వైభవంగా నిర్వహి స్తామన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆంధ్రజ్యో తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈవో ఇలా అన్నారు...

ప్రశ్న: ఉత్సవాలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయి?

జవాబు: ఈనెల 22 నుంచి శివరాత్రి వార్షిక ఉత్సవాలు క్షేత్రంలో ప్రారంభమవుతాయి. మార్చి 1 వ తేదీ రుద్రగుండం కోనేరులో త్రిశూల స్నానం, పూర్ణాహుతితో ముగుస్తాయి.

ప్రశ్న: భక్తులకు ఏవిధమైన ఏర్పాట్లు చేస్తున్నారు?

జవాబు: లక్ష మంది భక్తులు ఈ ఏడాది జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగానే అదనపు క్యూలైన్లతో పాటు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్ళు, మజ్జిగ, బిస్కెట్ల పంపిణీ, ఉచిత ప్రసాద వితరణ చేస్తున్నాం. భక్తులు ఎండ తట్టుకొనేందుకు పెండల్స్‌తో పాటు ప్రత్యేకంగా మ్యాట్లను ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక క్యూలో నిరంతరం ఉచిత దర్శనం ఉంటుంది.

ప్రశ్న: సాధారణ భక్తులకు వసతి సౌకర్యాలు ఎక్కడ?

జవాబు: భక్తులు విశ్రాంతి తీసుకొనేందుకు దేవస్థానం పరిపాలన భవనం పక్కన ఉన్న పోచా విశ్రాంతి భవనంతో పాటు ఆలయ రెండో ప్రాకారంలో షామియానాలు ఏర్పాటు చేసాం. దేవస్థానం అన్నదాన సత్రంలో ప్రతి రోజు 2 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తాం. జిందాల్ సంస్థతో పాటు ఇతర సంస్థల సహకారంలో ఉచితంగా మినరల్ వాటర్ సౌకర్యం కల్పిస్తాం.

ప్రశ్న: వైద్య సేవలకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

జవాబు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చే భక్తుల కోసం తిమ్మాపురం, గాజులపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికార్లు, సిబ్బంది ఆలయ పరిసరాల్లో రెండు ప్రదేశాల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు. అలాగే రెడ్‌క్రాస్, జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యసేవలు, మందులు అందజేస్తారు.

ప్రశ్న: లడ్డు, ప్రసాదాలు ఎన్ని సిద్ధం చేస్తున్నారు?

జవాబు: భక్తులకు ప్రసాదాల కొరత లేకుండా ఉండేందుకు లక్ష లడ్డులు సిద్ధంగా ఉంచాం. కోరినన్ని లడ్డు, ప్రసాదాలను అంద జేస్తాం. రద్దీకి అనుగుణంగా లడ్డులు అందుబాటులోకి తెస్తాం.

ప్రశ్న: స్పర్శ దర్శనాలు, రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలకు అనుమతిస్తారా?

జవాబు: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26 నుండి మార్చి 1 వరకు ప్రధాన గర్భాలయంలో భక్తులకు స్పర్శ దర్శనాలు నిలుపుదల చేస్తాం. మహానందీశ్వరుని నిజరూప దర్శనం ఏర్పాటు చేసాం. లింగోద్భవ పుణ్యకాలంలో కూడా రూ.100 టిక్కెట్టు కొనుగోలు చేసిన భక్తులను దర్శనానికి అనుమతిస్తాం. రుద్రగుండం కోనేరులో భక్తులకు పుణ్య స్నానాలకు అనుమతి లేదు. రెండో ప్రాకారం లోని పూల కోనేర్లల్లో భక్తులు స్నానాలు చేసుకొనే ఏర్పాటు చేసాం. మహిళలకు, పురుషులకు దుస్తులు మార్చుకొనేందు కోసం కోనేర్ల పరిసరాల్లో షెడ్లను ఏర్పాటు చేసాం.

ప్రశ్న: రథోత్సవం ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

జవాబు: ఈనెల 28న క్షేత్రంలో జరిగే మహా రథోత్సవానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసాం. ఇటీవలనే రథానికి కాళహస్తికి చెందిన ప్రత్యేక నిపుణులతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాం. రథోత్సవం ముందు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసాం, డ్రమ్స్ వాయిద్య కళాకారులతో ప్రత్యేక విన్యాసాలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: భక్తుల కాలక్షేపం కోసం కార్యక్రమాలు?

జవాబు: భక్తుల కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక కోలాటం, చెక్క భజన, హరికథలు, భజనలతో పాటు కూచిపూడి కార్యక్రమాలు ఉంటాయి. వీటిని తిలంకేంచుందుకు వీలుగా ఏర్పాటు చేశాం.

నమో నారసింహా..

వైభవంగా సుదర్శన హోమం, కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు,



రాంసింగ్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్ర మైన అహోబిలంలో స్వాతి మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూ ర్తులను అద్దాల మండపంలో కొలువు దీర్చి విశేష పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, తిరుమంజనం, కల్యాణం నిర్వహించారు. హోమ మండపంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మురళీధరన్, ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ పాల్గొన్నారు.

చైర్మన్ రామ్‌సింగ్ పూజలు..

ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రామ్‌సింగ్ విశేష పూజలు నిర్వహిం చారు. వేదపండితులు ఆలయ మర్యాద లతో స్వాగతం పలికా రు. దిగువ అహోబిలంలో కొలువైన ప్రహ్లాదవరద స్వామి, అమృతవల్లి అమ్మ వారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనను సన్మానించి తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

శ్రీశైలంలో దుకాణాల వేలం టెండర్లను ఉపసంహరించుకున్నాం

సుప్రీంకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో దుకాణాల వేలం టెండర్లను ఉపసంహరించుకున్నామని సర్వోన్నత న్యాయస్థానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులకు దుకాణాల కేటాయింపుపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో 2003లోని ఉత్తర్వులను 2015లో రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ క్రమంలో శ్రీశైలం దేవస్థానంలో షాపులు నిర్వహిస్తున్న హిందూయేతరులకు దేవదాయ శాఖ నోటీసులు జారీ చేసింది. దుకాణ సముదాయాలను ఖాళీ చేయాలని ఆదేశించింది. ఆ ఉత్తర్వులను కొందరు హైకోర్టులో సవాల్ చేశారు. అయితే, దేవాలయాల్లో హిందూయేతరుల వల్ల భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని, హిందూ దేవాలయాలను సంస్కరించేందుకు చట్టాలను సవరించే అధికారం తమకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. రాష్ట్ర ప్రభుత్వానికి సవరణలు చేసే అధికారం ఉందని పేర్కొంటూ 2019లో అన్యమతస్తుల పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును ఎండీ రబ్బానీ, ఎండీ రఫీ తదితరులు 16 జనవరి 2020న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మత ప్రాతిపదికన ఆలయ అద్దెదారులను ఖాళీ చేయాలని చెప్పడం సరికాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం మరోసారి శ్రీశైలం దేవాలయంలో దుకాణాల కేటాయింపు కోసం టెండర్లను ఆహ్వానించింది. దీంతో బాధితులు మరోసారి సుప్రీంకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. ఇప్పటికే శ్రీశైలంలో టెండర్లను ఉపసంహరించుకున్నామని ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే, ఇది పదేపదే జరుగుతోందని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని ధర్మాసనం సూచించింది. ఈ అంశంలో స్థానిక అధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేస్తామని ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది తెలపడంతో ధిక్కరణ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. గతంలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు విధించిన స్టేను ధర్మాసనం మరోసారి పొడిగించింది.

మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో సమీక్ష



ఉద్యోగులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డా. శాంతికళ

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు, నన్నూరు, హుశేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మూడు మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. 2024 జూలై, 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాతృ మరణాల వివరాలను డీఎంహెచ్‌వో అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భిణిలను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో కర్నూలు జీజీహెచ్ గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుగుణ, ప్రియాంక, రంగస్వామి, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ సుధీర్ కుమార్, డీఐవో డాక్టర్ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే అవసరం

డాక్టర్ బి.శంకర్‌శర్మ



విద్యార్థినులకు క్రీడాదుస్తులు అందిస్తున్న శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఎంతో అవసరమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. బుధవారం గాయత్రీ ఎస్టేట్‌లోని తన క్లీనిక్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 20, 21 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తున్న 66 మంది ఉషూ క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉషూ శిక్షకుడు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు ఇప్పించాలి : ఏఐటీయూసీ

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు టిడ్కో గృహాల్లో 2017 నుంచి సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న 20 మంది కార్మికులకు శ్రీబాలాజీ సెక్యూరిటీ ఏజెన్సీ సర్వీసెస్ కాంట్రాక్టర్ గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, కార్యదర్శి జి. చంద్రశేఖర్, సెక్యూరిటీ గార్డులు సుంకన్న, దేవేంద్రగౌడు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ వెంకటేష్‌కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు పోషించుకోవడానికి పిల్లల చదువుల ఫీజులు, ఇంటి అవసరాలకు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజు, మనోహర్, రమేష్, కృష్ణంరాజు, ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

అనగొండలో ఘనంగా అమ్మవార్ల జాతర

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ గ్రామంలో బుధవారం పోచమ్మ, కర్రెమ్మ అమ్మవార్ల జాతర వైభవంగా జరిగింది. గ్రామదేవతలు కొలువైన ఆలయాలను ఈ సందర్భంగా అందంగా ముస్తాబు చేశారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, జోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు.

నేడు ఎద్దుల బలప్రదర్శన పోటీలు : అనుగొండ గ్రామంలో గురువారం రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగు పోటీలు జరుగనున్నాయి. రామిరెడ్డితాత తిరుణాల, పోచమ్మ, కర్రెమ్మ జాతరను పురస్కరించుకుని పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలో వరుసగా పది జతల విజేత ఎద్దుల యజమానులకు దాతల సాయంతో నగదు ప్రకటించారు.

కళాశాల భవనాలు ఉర్దూ వర్సిటీకి ఇవ్వకండి

● సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ డిమాండ్

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్శిటీ అనుబంధ ఫర్ మెన్ కళాశాల భవనాలు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీకి అప్పగించవద్దని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఆర్‌భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉన్న విద్యాశాఖ అధికారులు భవనాలు ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత ఓర్వకల్లు సమీపంలో గతంలో టీడీపీ ప్రభుత్వం 144 ఎకరాలు ఏర్పాటు చేసి భవన నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించిందని, నిర్మాణాలు కూడా కొంత వరకు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, కోశాధికారి మధు, నాయకులు, షబ్బీర్, హేమంత్, వంశీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించకపోతే పోరాటమే

● వామపక్ష పార్టీల హెచ్చరిక

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహ కార్యదర్శి మునెప్ప హెచ్చరించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన ద్రోహానికి నిరసనగా బుధవారం కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్ అధ్యక్షతన వామపక్ష నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యురాలు నిర్మలమ్మ, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు రాముడు, విజయ్, షరీఫ్, అబ్దుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట వామపక్ష శ్రేణుల ధర్నా

పకడ్బందీగా పారిశుధ్య పనులు నిర్వహించాలి : కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రతి వీధిలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని ఆదిత్యనగర్, సంపత్‌నగర్, గురు రాఘవేంద్రనగర్, బిర్లా కాంపౌండు, వడ్డెగేరి, కేవీఆర్ గార్డెన్స్ కాలనీలలో సమీపంలోని హంద్రీనది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య, జంగిల్ క్లియరెన్స్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఏఈ మహేష్, పారిశుధ్య తనిఖీదారులు అనిల్ కుమార్, ఆంజనేయులుగౌడు, పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రీసర్వే వేగవంతం చేయండి : జేసీ


← ఎర్రదొడ్డి గ్రామంలో రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ నవ్య

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశించారు. మండలంలోని ఎర్రదొడ్డిలో జరుగుతున్న రీసర్వేను జేసీ నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, ఏడీ మునికన్నన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వేలో పనిచేస్తున్న టీంల వివరాలు, ప్రోగ్రెస్‌ను తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీల్‌కుమార్, రీసర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేయండి

పట్టణ పౌర సంక్షేమ సంఘం

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 20 మంది దాకా మున్సిపల్, సచివాలయం ఇంజనీర్లు ఉన్నా సున్నం కొట్టి శుభ్రం చేసే దిక్కులేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్. అన్వర్‌బాషా, ఎస్.శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ పక్కన తాగునీటి ట్యాంకు పరిసరాల్లో వారు పర్యటించారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను చూశాక ఆయన మాట్లాడుతూ శ్మశానాలను తలపించేలా దుర్వాసనతో పరిసరాలు ఉన్నాయని అన్నారు. కాలుతున్న చెత్తకుప్పలు, మద్యం ఖాళీ సీసాలు ఉన్నాయని, 6 లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు రూ. వందల కోట్లు వెచ్చించి నిర్మించిన తాగునీటి ట్యాంకులకు సున్నం కొట్టడానికి దిక్కు లేదని అన్నారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లోనే ఇట్లా ఉండటం ఆశ్చర్యకరమని అన్నారు. ఈయన వెంట పీసీఎస్ఎస్ నాయకులు ఎం.నాగరాజు, సీవీ వర్మ, మహ్మద్ యూనుస్, ఎస్. రమణగౌడు, ఎన్.మద్దిలేటి, శశికుమార్ రెడ్డి ఉన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు బీసన్న, షాకీర్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతిభ చూపాలి : వీసీ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకట బసవరావు అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో ఈనెల 3 నుంచి 9 వరకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని శ్రీ వైఎన్ కాలేజీలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో వర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పి. లోకేష్, బీ. దీపిక ప్రతిభను ప్రదర్శించినందుకు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. నాగరాజు, కె. వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీసీల నియామకాల్లో పారదర్శక : టీఎస్ఎఫ్

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన ప్రసన్నకు ఉపకులపతి పదవి కట్ట బెట్టడం అభినందనీయమని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ ఎదురుగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మొదటిసారి ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఉపకులపతిగా నియమించడం శుభపరిణామం అన్నారు.

‘ఆత్మవిశ్వాసానికి ఆలంబనగా జీవన నైపుణ్యాలు’

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి ఆలంబనగా జీవన నైపుణ్యాలు నిలుస్తాయని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ విద్యార్థినులు నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ‘ఆన్ జాబ్ ట్రైనింగ్’ శిక్షణలు పూర్తి చేసిన సందర్భంగా వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలెప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవన నైపుణ్యాలే ఉద్యోగ అవకాశాలను పెంచే ముఖ్యమైన సాధనాలుగా ఉపయోగపడుతున్నాయని చెప్పారు. సమయపాలన, నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్ వంటి నైపుణ్యాల శిక్షణతో భవిష్యత్తు జీవితం ప్రగతి పథంలో నడిచేలా విద్యార్థినులు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రభుచరణ్, ఎంఏ నవీన్, శివయ్య, నాగిరెడ్డి, లక్ష్మి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులను, కళాశాల ప్రిన్సిపల్ లాలప్పలను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.



డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ లాలెప్ప, అధ్యాపకులు

ఇష్టంతో చదివితే విజయం సొంతం

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయంతో కాకుండా ఇష్టంతో చదివితే.. జీవితంలో అద్భుత విజయాలు సాధించవచ్చని కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా భయాందోళనలకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మారుతి పౌరోహితం, ప్రిన్సిపాల్ సుంకన్న, పీడీఎస్‌యూ నాయకులు రాజు, సురేష్, అఖిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

కల్లూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెట్లమల్లాపురంలో సుంకులా పరమేశ్వరి ధ్వజస్థంభ, మహాగణపతి, కుమారస్వామి, నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహప్రతిష్ట వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచు వెంకటరెడ్డి, చాకలి మధు, పురుషోత్తంరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి సహకరించండి

గూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు నగర అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులు రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు కమిషనర్‌ను కోరారు. బుధవారం గూడూరు నగర పంచాయితీ కార్యాలయంలో కమిషనర్ రమేష్‌బాబుకు పూలమాలలతో టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పౌలు, చాంద్‌బాషా, మన్సూర్ బాషా, నాగప్ప యాదవ్, పుట్టపాశం రామాంజనేయులు, చికెన్ వాహీద్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్స్ టెన్నికాయిట్ క్రీడల్లో రాణించాలని ప్రముఖ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వెంకాయపల్లె వద్ద సెయింట్ జోసెఫ్ మహిళా కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీనియర్స్ ఉమ్మడి జిల్లా టెన్నికాయింట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్త్రీ పురుషుల జట్లు ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు పశ్చిమగోదావరి జిల్లాలోని చిట్యాలలో 48వ స్త్రీ, పురుషుల రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామల, సురేష్, రవి, గోకారి, సూరి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఐ శ్రీనివాసులు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రకటనలను నమ్మి విలువైన వస్తువులు తక్కువ ధరకు వస్తాయనే ఆశతో డబ్బు చెల్లించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి : సీపీఎం



గూడూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపిందని సీపీఎం మండల కార్యదర్శి జే.మోహన్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి, కార్మిక వర్గానికి ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దానమన్న, చిన్నరాజు, సురేష్, సుధాకర్ పాల్గొన్నారు.

22 నుంచి రాంచిలో హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 27 వరకు జార్ఖండ్‌లోని రాంచిలో 53వ జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు తెలిపారు. సత్యసాయి జిల్లాలో ఇదివరకు జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రజట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్ల మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ డీ-1 నాగేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 1ఏ నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సెంట్రల్‌ప్లాజా పరిసర ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుదన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి అధికారులకు సహకరించాలన్నారు.

ఆర్థిక సాయం

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం నవాజ్ ఖాన్ అనే యువకుడికి కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.లాలెప్ప, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది రూ.50వేలు నగదును ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లాలెప్ప మాట్లాడుతూ నవాజ్‌ఖాన్ త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.

శ్రీశైలానికి పాదయాత్ర

కల్లూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా దివ్యక్షేత్రం శ్రీశైలానికి బుధవారం కల్లూరు అర్బన్ పరిధిలో పలువురు దీక్షాపరులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. 35వ వార్డులోని సుంకులమ్మ గుడిలో నిర్వాహకులు శివస్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ముఖ్య అతిథిగా హాజరై శివస్వాముల భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తి పారవశ్యంతో కాలినడకన శ్రీశైలం పాదయాత్రగా వెళ్లే వారికి అంతా మంచి జరగాలని ఎమ్మెల్యే ఆకాక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదన్న, కె. పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి శివస్వాములు బుధవారం శ్రీశైలం బయలుదేరారు. లద్దగిరి, వర్కూరు, ప్యాలకుర్తి గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వెళ్లారు.

అన్నదానానికి సహకారం

గూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో శ్రీశైలం పుణ్యక్షేత్రంలో గత 23 సంవత్సరాలుగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం గూడూరు పట్టణంలో అన్నదాన కార్యక్రమానికి అవసరమైన సరుకులు, వస్తువులతో శ్రీశైలం క్షేత్రానికి తీసుకెళ్లారు. ముందుగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలంలో ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు అన్నదానం కార్యక్రమాన్ని నీలకంఠేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

పిటీషన్లను త్వరగా పరిష్కరించండి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే జరిగిన గ్రామాల్లో సబ్ డివిజన్, ఎల్‌పైన్‌కి సంబంధించిన పిటీషన్లను త్వరితగతిన పరిష్కరించాలని సీసీఎల్ఏ జయలక్ష్మి.. కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో సీసీఎల్ఏ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బ్లాక్ బౌండరీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆ రీసర్వే గ్రామాలను సందర్శించి రీసర్వే సిబ్బందికి పలు సూచనలు ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ,‘సర్వే ఏడీ ముని కన్నన్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై నియంత్రణ అవసరం

యూనియన్ డైరీ ఆవిష్కరణలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాపై నియంత్రణ ఉండాల్సిందేనని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలోని మౌర్య ఇన్‌లోని తన కార్యాలయంలో ఆయన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నూతన సంవత్సర రాష్ట్ర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా జర్నలిస్టులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా ముందుండి ఏపీయూడబ్ల్యూజే పోరాడుతున్నదని అన్నారు. యూట్యూబ్ ఛానెళ్ల చేసే హడావుడి వల్ల మెయిన్ స్ట్రీమ్ మీడియాకు ఆదరణ తగ్గిపోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. సోషల్ మీడియాపై కొన్ని నిబంధనలు అవసరమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చట్టాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ సభ్యులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌వీ సుబ్బయ్య, కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్‌గౌడ్, అంజి, ఏబీఎన్ సుంకన్న, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యుడు కె. దేవేంద్ర రెడ్డి, జాలవాడి బాషా, అవినాష్, స్నేహల్, సూర్యబాబు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను గుర్తించి తీసుకెళ్లండి : పీడీ


చిన్నారులు వీర, శిరీష

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీ.క్యాంపు శిశు గృహంలో ఉన్న శిరీష (5) వీర (4) బాల బాలికలను తల్లిదండ్రులు, బంధువులు గుర్తించి తీసుకెళ్లాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. నిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలిక శిరీషను నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 16వ తేదీ రాత్రి వదలి వెళ్లారని అన్నారు. అప్పటి నుంచి సీ.క్యాంపు శిశు గృహంలో బాలిక ఉంటోందని అన్నారు. 2021 ఆగస్టులో వెంకటమ్మ అనే మహిళ ఆర్ఎస్ రోడ్డు వద్ద బాగ్యనగర్‌లో తాగి పడిపోవడంతో, ఆమె వద్ద ఉన్న 16 రోజుల మగశిశువును చైల్డ్ లైన్ సిబ్బంది టూటౌన్ పోలీసులకు అప్పగించారన్నారు. ప్రస్తుతం బాలుడు శిశుగృహంలో ఉంటున్నాడని అన్నారు. ఈ పిల్లలకు సంబంధించిన వారు ఆధారాలతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఐసీడీఎస్ అధికారులను కలిసి వారిని తీసుకుని వెళ్లాలన్నారు. లేకపోతే 30 రోజుల తర్వాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారిని అనాథలుగా తీర్మానించి దత్తత ఇవ్వనున్నట్లు ఐసీడీఎస్ పీడీ తెలిపారు.

హామీ నిలుపుకున్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే శ్యాంబాబు నిలబెట్టుకున్నారని టీడీపీ చక్కరాళ్లనాయకుడు తిమ్మరాజు అన్నారు. బుధవారం మాట్లాడుతూ గ్రామం ఏర్పడినప్పటి నుంచి సీసీ రహదారులు, కాలువలు లేవన్నా రు. గత ఎన్నికల ప్రచారానికి వచ్చిన సమయంలో సీసీ రోడ్డు, కాలువలు నిర్మిస్తానని హామీ ఇచ్చి నెరవేర్చారని, ఎమ్మెల్యేకు గ్రామస్థులు రుణపడిఉంటారన్నారు.

రీసర్వేలో లోపాలు ఉండకూడదు

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



సర్వే వివరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో లోపాలు ఉండకూడదని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మండలంలోని పెసలబండలో రీ సర్వే పనులను బుధవారం తనిఖీ చేశారు. రైతులకు భూ సమస్యలు తలెత్తకుండా సకాలంలో సర్వే నిర్వహించాలన్నారు. సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. సర్వేయర్ ఈశ్వర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు వసతులు కల్పించండి



వినతిపత్రం ఇస్తున్న చైర్‌పర్సన్ సావిత్రి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రజకులకు వసతులు కల్పించాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి ఎమ్మెల్యే పార్థసారథికి విన్నవించారు. రాంజల చెరువు వద్ద దోబీ ఘాట్లు శిథిలావస్థకు చేరి, రజకులు ఇబ్బందులు పడుతున్నారని మరమ్మతులు చేయించాలని కోరారు. అలాగే ప్రహరీ నిర్మించి భద్రత కల్పించాలన్నారు. ఎమ్మెల్యే అక్కడే ఉన్న చైర్ పర్సన్ సావిత్రితో మాట్లాడారు. రజక ఉద్యోగుల సంఘం నాయకుడు నాగరాజు, రజక సంఘం అధ్యక్షుడు పెద్ద రామన్న, సతీష్, ఉరుకుంద, న్యాయవాదులు ప్రకాష్, నగేష్ పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'తో మెరుగైన బోధన



మాట్లాడుతున్న ఎంఈవో రంగస్వామి

మద్దికెర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి ఇన్ సర్వీస్ సర్టిఫికెట్ కోర్సుతో మెరుగైన బోధనా సామర్థ్యం వస్తుందని ఎంఈవో రంగస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం జడ్పీ బాలుర పాఠశాలలో ఇస్తున్న శిక్షణా తరగతుల్లో వారు మాట్లాడారు. ప్రీ స్కూల్ విద్యతో పిల్లలు సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు. శిక్షణ ఆరు రోజుల పాటు ఉంటుందన్నారు. రిసోర్స్‌పర్సన్లు లీలావతి, లక్ష్మీనారాయణ సంధ్య, ఎంఈవో-2 గోపాల్ తదితరులు ఉన్నారు.

పేదలను గుర్తించేందుకే సర్వే

దేవనకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేదరికాన్ని గుర్తించేందుకు సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే చేయ నున్నట్లు డీఎల్‌డీవో అనురాధ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. యజమానితో మాట్లాడి 27 అంశాలపై సర్వే చేయాలని, మార్చి 2 లోగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో సూర్యనారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌డీవో

లక్ష్మీనగరంలో దేవర



బోనాలతో వెళుతున్న గ్రామస్థులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో లక్ష్మీనగరం గ్రామంలో బుధవారం దేవర నిర్వహించారు. తెల్లవారుజామున పూజలు చేసి, బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఆడపడుచులు, బంధువులతో గ్రామంలో సందడి కనిపించింది. టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, బలరాంగౌడ్, రమాకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ పూజలు చేశారు.

వాల్మీకులను విస్మరించిన ప్రభుత్వం

హాలహర్వి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వాల్మీకును విస్మరించిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. బుధవారం హాలహర్విలో వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాయలసీమలో అధిక జనాభా కలిగి వాల్మీకులకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే కేంద్రాన్ని ఒప్పించి ఎస్టీలోకి చేర్చుతామని మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆరోపించారు. తాను కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. కన్వీనర్ రామిరెడ్డి, అర్దగేరి శ్రీనివాసులు ఉన్నారు.



హాలహర్విలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వైభవంగా శివాజీ శోభాయాత్ర



ఆదోనిలో శివాజీ శోభాయాత్ర



వాహనం నడుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోనిలో భారీ ర్యాలీ.. ట్రాక్టర్ నడిపిన ఎమ్మెల్యే, పత్తికొండలో బీజేపీ నాయకుల నివాళులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి బుధవారం ఆదోని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఫారెస్ట్‌లైన్ చిన్నశక్తి గుడి ఆవరణలో రాత్రి ఛత్రపతి శోభాయాత్రకు ముందు బహిరంగ సభను నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. హిందు వుల ఐకమత్యం కోసం శివాజీ పోరాటం చేశారని అన్నారు. శక్తిగుడి నుంచి కిలిచిన్ పేట, షరాఫ్ బజార్, పండిట్ నెహ్రూరోడ్డు, మున్సిపల్ మెయిన్ రోడ్డు మీదుగా శోభాయాత్రంగా సాగింది. శివాజీ చిత్రపటం ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే పార్థసారథి స్వయంగా నడిపారు. డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర కమిటీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీజేపీ రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్, గురుడాద్రి దత్తాత్రేయ శర్మ, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

పత్తికొండ పట్టణంలో..

పత్తికొండ టౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో 395వ శివాజీ జయంతి నిర్వహించారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, గోవర్దన్ నాయుడు, హోసూరు బ్రహ్మయ్య, కరణం నరేష్ చిత్రపటానికి నివాళి అర్పించారు. భారతదేశంలో మొఘల్ సామ్రాజ్య వాదులను ఎదురించి పోరాడిన ధీరుడు ఛత్రపతి శివాజీ అన్నారు. దేశవ్యాప్తంగా హిందువులను ఏకతాటిపైకి తేవడానికి పోరాడారన్నారు. సీసీ రంగన్న, మల్లికార్జున, శంకరయ్య, భాస్కర్ ఉన్నారు.



పత్తికొండలో నివాళి..

ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

ఆలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో నివాస ముండేవారు స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశమిచ్చిదని తహసీల్దార్ గోవింద్ సింగ్ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. భూ పరిపాలన కమిషనర్ జీవో నెంబర్ 30 జారీ చేశారన్నారు. లబ్ధిదారులు గ్రామ సచివాలయాల్లో ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను గుర్తించాలి: ఎంఈవో

ఆలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించాలని మండల విద్యాధికారి కోమలదేవి, సీడీపీవో శశికళ సూచించారు. బుధవారం పట్టణంలోని జిలా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో అంగన్వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సుపై రెండో రోజు శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు తమ బోధనా సామర్థ్యం పెంచుకునేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 చిరంజీవి రెడ్డి, సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎం సహాయ నిధి



బాధితులకు చెక్కు ఇస్తున్న మీనాక్షినాయుడు

ఆదోని ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. బుధవారం స్వగృహంలో 12మంది లబ్దిదారులకు రూ.4.50 లక్షల చెక్కులను అందజేశారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. నియోజకవర్గ ప్రజలకు హాస్పిటల్ బిల్లులు ఉంటే తనను సంప్రదించాలని, రీయింబర్స్‌మెంట్ ద్వారా ఇపిస్తామని తెపారు. తెలుగు యువత కార్యదర్శి వెంకటేష్ చౌదరి, బసాపురం రామస్వామి, అల్తాఫ్, లోకనాథ్ రెడ్డి, షాదూల్లా పాల్గొన్నారు.

ఎండుమిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎండుమిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని క్వింటాలు రూ.25వేల ప్రకారం కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని మిర్చి యార్డులో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రైతులు ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు ఎండుమిర్చి సాగుకు విత్తనాలు, ఎరువులు, పిచికారి మందులు, కోతలు పెట్టుబడి ఖర్చులు రూ.1.50లక్షల అవుతుందన్నారు. మార్కెట్‌లో ఎండుమిర్చి క్వింటాలు రూ.13వేలు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని దీంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్ సహాయ కార్యదర్శి శాంత కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, రైతు సంఘం నాయకులు ఎల్లప్ప, సత్యనారాయణ, అల్తాఫ్ పాల్గొన్నారు.

రేపు రుణాలకు ఇంటర్వ్యూలు

ఆలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల రుణాల ఇంటర్వ్యూలను ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యద్ మహబూబ్ బాషా బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు అలూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో దరఖాస్తు, సర్టిఫికెట్లు, ఫొటోతో హాజరు కావాలన్నారు.

అత్యధికులు మాట్లాడే భాష హిందీ

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధిక మంది మాట్లాడే భాష హిందీ అని కిలిచినపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం సునీల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం భాషోత్సవాల సందర్భంగా హిందీ భాష ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హిందీ నేర్చుకుంటే ఎక్కడైనా రాణించవచ్చన్నారు. ఉపాధ్యాయులు బాలచంద్రుడు, బ్రహ్మానంద రెడ్డి, చక్రపాణి, ఆనందమ్మ, ఇందు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నుంచే మెరుగైన విద్య

దేవనకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ స్థాయి నుంచే చిన్నారులకు మెరుగైన విద్య అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనవాసులు తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు రెండోరోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం విభిన్న ప్రతిభవంతుల పాఠశాలకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. ఎంఈవో-2 నిర్మలాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీత, షాహిదా, హెచ్ఎం మద్దిలేటి ఉన్నారు.



విభిన్న ప్రతిభావంతులతో కో ఆర్డినేటర్

సమాచారం

22న కంటి వైద్య శిబిరం

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న పట్టణంలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ విశ్వభారతి మెడికల్ కాలేజీ వైద్యుల పట్టణంలో సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో శిబిరం ఉంటుందన్నారు.

నేడు జాబ్ మేళా

ఆలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇబ్రహీం పంక్షన్ హాల్‌లో నేడు జాబ్‌మేళా ఉంటుందని నిర్వాహకులు దుర్గ ప్రసాద్, తిరుమలయ్య బుధవారం తెలిపారు. విశ్రాంత ఐఏఎస్, పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సహకారంతో నిర్వహిస్తున్నామని పదో తరగతి నుంచి బీటెక్ పూర్తిచేసిన నిరుద్యోగులు జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలని సూచించారు. 60 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థులు సర్టిఫెట్లతో సహ హాజరుకావాలన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

దేవనకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పోరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. ఉదయం నుంచి ఎంపీడీవో కార్యాలయంలో దేవనకొండ, తెర్నేకల్, పి.కోటకొండ, కప్పట్రాళ్ల బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ రుణాలు

హాలహర్వి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇస్తుందని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. బుధవారం మాట్లాడుతూ నేటి నుంచి బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని దరఖాస్తుదారులు హాజరుకావలని కోరారు.

నివాసముంటే పట్టా ఇస్తాం

దేవనకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అక్షేపణలులేని ప్రభుత్వ స్థలాల్లో నివాసముండేవారికి పట్టా ఇస్తామని తహసీల్దార్ ప్రసాద రాజు అన్నారు. గ్రామ సచివాలయాల్లో దరకాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పేదల నివాస స్థలానికి పట్టా ఇచ్చేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. మూడు సెంట్ల వరకు మాత్రమే పట్టా ఇవ్వనున్నట్లు తెలిపారు

ముగ్గురికి గాయాలు

దేవనకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన మహ్మద్‌ను లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. పోలీసులు ఆస్పరి వద్ద లారీని స్వాధీనం చేసుకున్నారు. అదే రహదారిపై కుంకనూరు సమీపంలో బైక్‌పై వస్తున్న వీరేష్,భాస్కర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కర్నూలుకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని నివారిద్దాం



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో వచ్చే దృష్టి లోపాన్ని నివారిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యే, డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ, ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేశారు. సెల్‌ఫోన్ అధికంగా వాడడం, ఆహార నియమాలు పాటించకపోవడంతో దృష్టిలోపం సంభవిస్తుందన్నారు. విద్యార్థులు కూరగాయలు, ఆకుకూరలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే తమ కళ్లను భద్రంగా ఉంచుకోవచ్చు అన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని 201 పాఠశాలల్లో కంటి పరీక్షలు చేసి, 3,700 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ సత్యవతి, ఎంఈవో శ్రీనివాసులు, హెచ్ఎం మల్లికార్జున, అలిమ్ సిద్ధిఖీ, డాక్టర్ వినోద్ పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలను వినియోగించుకోవాలి

- ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి



ఉద్యాన పథకాలను వివరిస్తున్న జిల్లా అధికారి

పత్తికొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పథకాలను ఉపయోగించుకోవలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి సూచించారు. బుధవారం పత్తికొండలో ఉద్యాన అధికారి దస్తగిరి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. పండ్లతోటల రైతులకు ప్యాక్ హౌస్‌కోసం రూ2లక్షలు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ఫారంపండ్‌కు రూ75వేలు, ఉల్లి గోదాముకు రూ.80 వేల చొప్పున సబ్సిడీని ప్రభత్వం అందిస్తుందన్నారు. అలాగే సూక్ష సేద్యం పథకంలో బిందు సేద్యానికి ఓసీ, బీసీ రైతు లకు 90శాతం, ఎస్టీ, ఎస్సీ రైతులకు 100 శాతం రాయితీ ఇస్తున్నామ న్నారు. ఏపీ ఎంఐడీసీ జయరామిరెడ్డి, అధికారులు నాగ సునీల్‌కుమార్, ఖాజా పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం

వెల్దుర్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో సుహాసినమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎంపీపీ రంగడు, జడ్పీటీసీ సుంకన్న పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు

హాలహర్వి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు గుర్తిపు సంఖ్యను తెచ్చిందని ఏవో శివశంకర్ అన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

కేంద్ర బడ్జెట్ పేదలకు శాపం

నియోజకవర్గాల్లో వామపక్ష నాయకుల ఆందోళన



పత్తికొండలో ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ పేద ప్రజలకు శాపంగా మారిందని వామపక్షాల నాయకులు లక్ష్మన్న, అజయ్‌బాబు, సుదర్శన్, కల్లుబావి రాజులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం భీమాస్ కూడలి వద్ద వామపక్ష నాయకులు ఆందోళన చేశారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉంద న్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబ డిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయిం చాలని, విభజన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. గోపాల్, వీరారెడ్డి, ఈరన్న, బసాపురం గోపాల్ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై వామపక్షాల నిరసన

ఆలూరు: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష నాయకులు ఆలూరులోని అంబేద్కర్ కూడలిలో నిరసన తెలిపారు. సీపీఎం నేత కేపీ నారాయణ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీఎస్ రాధాకృష్ణ సీపీఐ జిల్లా సమితి సభ్యుడు భూపేష్ మాట్లాడుతూ రూ50 లక్షల కోట్ల బడ్జెట్ కేవలం సంపన్నులు కోసమే అన్నారు. రూ.7లక్షల కోట్ల రాయితీలను ధనవంతులకు ఇచ్చారని ఆరోపించారు. కార్మికులు, రైతులకు రాయితీలు ఇవ్వలేదని సామాన్యులపై భారం మోపారన్నారు. హనుమంతు, రామాంజనేయులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌కు వరం

పత్తికొండ టౌన్: కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ వర్గాలకు వరంగానూ, సామాన్యులకు శాపంగానూ ఉందని సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్, సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి ఆరోపించారు. బుధవారం పత్తికొండలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి నాలుగు స్థంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మోదీ ప్రభుత్వం సంపన్నులకు ఊడిగం చేస్తూ.. పేదల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రంగన్న, కారన్న, గురుదాస్, కృష్ణ, నెట్టికంటయ్య, గోపాల్, దస్తగిరి, రంగారెడ్డి పాల్గొన్నారు.

సామాన్యులకు శాపంగా కేంద్ర బడ్జెట్

దేవనకొండ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సామాన్యులకు శాపంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరశేఖర్, సీపీఐ కార్యదర్శి నర్సారావ్ అన్నారు. బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు ధర్నా చేశారు. బడ్జెట్లో రాష్ట్రవిభజన చట్టంలోని ఒకటి కుడా లేదని, వెనుకబడిన రాయలసీమకు తీరని అన్యాయం చేశారన్నారు. అశోక్, రవి, నాగేంద్ర, పాండు పాల్గొన్నారు.

కేంద్రానికి ప్రజలే బుద్ధి చెబుతారు

తుగ్గలి: ప్రజా వ్యతిరేక బిల్లులు తెచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారనీ వామపక్ష నాయకులు నబీ రసూల్, సుల్తాన్, శ్రీరాములు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లులకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ బిల్లులతో రైతులు, నిరుద్యోగులకు ఉపయోగం లేదన్నారు. ఏపీ విభజన చట్టాన్ని అమలుచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ రాముడుకు వినతి పత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు, రంగన్న, మద్దిలేటి, నాగరాజు ఉన్నారు.

జగన్ అనుచిత వ్యాఖ్యలను సహించం

పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు



వెల్దుర్తిలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తుగ్గలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ క్రిష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ ఇప్పుడు అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటన్నారు. మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, బెస్త కృష్ణ ఎడవలి తిమ్మప్ప, మైరాముడు ఉన్నారు.

పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు తగవు

వెల్దుర్తి/టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పోలీసులపై మాజీ సీఎం వైఎస్ జగన్ అనుచిత వ్యాఖ్యలు తగవని మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదు చేయాలని టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు ఈదుల వెంకటరాముడు అన్నారు. బుధవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శాంతి భద్రతలను రక్షించే పోలీసులపై వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆదేశాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నార్లాపురం శ్రీనివాసులు, మదార్‌పురం మనోహర్ ఉన్నారు.

బృందావనానికి కలశ పూజ

మంత్రాలయం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి సన్నిధానంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కలశ పూజ చేశారు. బుధవారం బృందావనం మధ్యలో కలశ పూజ చేసి ఆ నీటితో రాఘవేంద్రస్వామి, వాదేంద్రతీర్థులు, మంచాలమ్మకు, పూర్వపు పీఠాధిపతుల బృందావనాలకు కలశాభిషేకాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈ అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. అనంతరం బృందావనాలకు ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతులు ఇచ్చారు.

'ఇంటి పన్నులు వసూలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న మేజర్ సర్పంచ్, పీఎస్

గోనెగండ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి చివరి నాటికి గోనెగండ్లలో ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ సూచించారు. బుధవారం పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న గృహాల యజమానులు తప్పని సరిగా స్వర్ణపంచాయతీ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్నవారు తప్పుఒప్పులను సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన స్థల సమస్యను పరిష్కరించాలి: కేవీపీఎస్

మంత్రాలయం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో 125, 126 సర్వే నెంబర్లను శ్మశానానికి కేటాయించిన స్థలం సమస్య పరిష్కరించకుండా గ్రామస్థుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు అన్నారు. బుధవారం చెట్నహళ్లి గ్రామంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, మండల కార్యదర్శి అంజి, కాటికాపరుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మారెప్ప, సురేష్ ఆధ్వర్యంలో సర్వే నెంబర్.113లో రస్తా పరంబోకులో శ్మశానం ఉందని, జగనన్న కాలనీ దగ్గరలో మృతదేహాలను అంత్యక్రియలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 126 సర్వేనెంబరు శ్మశాన స్థలమని తెలినప్పటికీ అక్కడి కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం పర్చుకోవాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు అనిల్, లక్ష్మన్న, వీరేష్, రాజు, డానియేలు, చిన్నతిక్కన్న, అబ్రహం, విజయ్, దేవపుత్ర, నరసన్న, శాంతిరాజు, రచ్చుమర్రి నరసన్నలు పాల్గొన్నారు.

నేడు మొక్కల పెంపకంపై అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఔషధ, సుగంధ మొక్కల పెంకపంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏపీ ఔషధ మొక్కల బోర్డు సీఈవో డాక్టర్ మంజుల డి హోస్మని తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఔషధ, సుగంధ మొక్కలను రైతులు ఎలా సాగు చేసుకోవాలి, వాటిని మార్కెట్‌లో ఎలా విక్రయించాలనే విషయాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, జిల్లా అటవీశాఖ అధికారి శ్యామల, సీమ్యాప్ శాస్త్రవేత్త డాక్టర్ జ్ఞానేష్, మెడికల్ అధికారి స్వర్ణలత, హార్టికల్చర్ అధికారి శ్రీవాణి హాజరవుతున్నారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి'

గోనెగండ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా తమ అధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరించుకోవడం కోసం ఆయా సచివాలయాలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కుమారస్వామి కోరారు. బుధవారం ఆయన మట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీ ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ భూమి క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. 150గజాలు వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని, కాకపోతే లబ్ధిదారుడు గాని ఆ కుటుంబసభ్యులు గాని ఐటీ చెల్లింపుదారులై ఉండరాదన్నారు. అలాగే నాలుగు చక్రాల వాహనం ఉంటే అనర్హులు అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 150 గజాల వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించక్కరేదన్నారు. లే అవుట్‌స్థలాలు, మాస్టర్ ప్లాన్, జోనల్‌ప్లాన్‌లు, నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాలు, క్రమబద్ధీకరణ చేయరన్నారు. దరఖాస్తు అనంతరం అర్హులైన వారిపేరు మాత్రం సచివాలయం దగ్గర జాబితాను ప్రకటిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

గోనెగండ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు సమాజానికి చీడపపురుగులా మారాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోనెగండ్ల సీఐ గంగాధర్ కోరారు. బుధవారం గోనెగండ్లలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో నేను సైబర్ స్మార్ట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాల గురించి వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపే వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైన సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీనెంబర్ కు కాల్ చేయాలని తెలిపారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందవరం: సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం నందవరం హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మారికాంబ దేవి దేవర



అమ్మవారిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు

కౌతాళం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సులేకేరి గ్రామంలో వెలసిన గ్రామ దేవత మారికాంబ దేవి దేవర ఉత్సవం బుధవారం భక్తుల సమక్షంలో కన్నుల పండుగగా కొనసాగినది. ఆలయ పూజారులు అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం గ్రామ మహిళలు కుంబాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి టీడీపీ నాయకులు సతీష్ నాయుడు దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు సన్మానించారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సీపీఎం, సీపీఐ నాయకుల నిరసన



మంత్రాలయంలో ధర్నా చేస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో..

మంత్రాలయం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమని, ఏపీకి అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. బుధవారం మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం మండల కార్యదర్శి జయరాజు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు కేటాయించడంలో రాష్ట్రాలపై కేంద్రం వివక్షత చూపించిందని ఆరోపించారు. కోట్లాది మంది పని చేస్తున్న ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయించలేదని ఆరోపించారు. 200పని దినాలు కల్పించాలని, కనీస కూలీ రూ.600లు ఇవ్వాలని ఆందోళనలు చేస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు కార్పొరేట్ పన్నులు విధించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, నాయకులు ప్రాణేష్, అనిల్, అంజి, రాజు, వీరేష్, లక్ష్మన్న, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయ కార్యదర్శి సమీఉల్లా, జిల్లా ఉపాధ్యక్షులు కేసీ జబ్బార్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దాదావలి, తిమ్మగురుడు, విజయేంద్ర, రాజీవ్, నరసింహారెడ్డి, ఖాజా, మల్లికార్జునగౌడు, నరసింహులు, టైలర్ ఖాజా, వీరాంజిగౌడు, నాగరాజు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఏపీ ప్రజలను కేంద్ర ప్రభుత్వం నమ్మించి మోసగించిందని సీపీఎం కార్యదర్శి కరుణాకర్, సీఐటీయూ నాయకుడు నబి అన్నారు. బుధవారం గోనెగండ్లలోని బస్టాండ్ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకులు బాషా, రంగస్వామి, హనుమన్న, బడేసా, సురేష్, వీరేష్, తేజ, పాల్గొన్నారు.

నందవరం: మండలకేంద్రంలో కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా బుధ వారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, నాయకులు శాంతప్ప, ముని, తిమ్మప్ప, ఉరకుందు, తాయప్ప, నరసింహులు, దస్తగిరి, దేవరాజ్ పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీ గోడౌన్‌ల ఏర్పాటుకు చర్యలు: ఎమ్మెల్యే బీవీ



ఉద్యానవనశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని రైతులు ఇబ్బంది పడకుండా కోల్డ్ స్టోరేజీ గోడౌన్ లను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో ఉద్యానవ శాఖ కింద ఏఏ కార్యక్రమాలు చేపడుతున్నారని, ప్రభుత్వం నుంచి ఏఏ పథకాలు మంజూరయ్యాయోనని హార్టికల్చర్ అధికారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగుతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మిరపతో పాటు ఇతర ఉద్యానవన పంటలు సాగుచేసే రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజి గోడౌన్‌లను ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామ న్నారు. డీహెచ్‌వో రామాంజనేయులు, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, హార్టికల్చర్ అధికారి శ్రీవాణి, ఇంజనీర్ రంజిత్, జగదీష్ పాల్గొన్నారు.

రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభంలోపు పట్టణంలోని ఆయా మసీదుల దగ్గర అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ సమావేశ భవనంలో ముస్లీం మత పెద్దలు, ఆయా మసీదుల నిర్వాహ కులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఆయా మసీదుల దగ్గర నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీటి సౌకర్యం లేని చోట ప్రత్యేకంగా వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నటయితే గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వాహిద్ ఉసేన్, డీఎండబ్ల్యూఓ సబియా పర్వీన్, డీఎస్పీ ఉపేంద్రబాబు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మైనార్టీసెల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉసేన్‌పీరా, తురేగల్‌నజీర్, నాయకులు హాజీబడేసాబ్, ముల్లాఖలీముల్లా, గట్టు అల్తాఫ్, సలీం, గుల్జాసలాం, వాహిద్‌తో పాటు ఆయా మసీదుల పెద్దలు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని పేట గ్రామంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. గ్రామంలో టీడీపీ పాలనా ప్రగతిపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమీక్షించారు. నందవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో ఇది మంచి ప్రభుత్వం ప్రజలకు జరిగిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. గ్రామంలో బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల దేశాయి గురురాజారావు, ఉదయ్‌గౌడ్, బీమన్నగౌడు,ఈరన్నగౌడు, డీవీ రాముడు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి



మంత్రాలయంలో శోభయాత్ర నిర్వహిస్తున్న యువకులు

కోసిగి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో శ్రీసిద్ధారుఢ శాంతాశ్రమంలో మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం కోసిగిలోని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ.. జై భవానీ.. జై శివాజీ అంటూ నినాదాలతో హిందువుల కోసం పోరాడిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని, కోసిగి మండల కేంద్రంలో ఛత్రపతి శివాజి జయంతి వేడుకలు జరుపుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం సిద్ధారుఢ శాంతాశ్రమం నుంచి సాయంత్రం ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, చిన్నతాయన్న, వక్రాణి వెంకటేశ్, ఈరన్న భరద్వాజశెట్టి, మాదేవ, వీరారెడ్డి, వైసీపీ నాయకులు మురళిరెడ్డి, ఎంపీపీ ఈరన్న, తదితరులు ఉన్నారు.

కౌతాళం: కౌతాళంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కౌతాళం త్రిలింగేశ్వర స్వామి దేవాలయంలో ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి పూజించారు. సాయంత్రం గ్రామ యువకులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మారుతి మోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, సర్పంచ్ పాల్‌దినకరన్, పెద్దలు ప్రహ్లాదాచారి, సుబ్బరాజు, వెంకటపతిరాజు, రాజానందు, తిక్కయ్య పాల్గొన్నారు.

మంత్రాలయం: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ హిందువులందరికీ స్ఫూర్తిదాయకం కావాలని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. బుధవారం మంత్రాలయంలోని ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో భాగంగా ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఠాధిపతి పాల్గొన్నారు. మహాముఖద్వారం నుంచి రాఘవేంద్ర సర్కిల్, అంబేడ్కర్ విగ్రహం కూడలి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవైష్ణవి పాఠశాల హెచ్‌ఎం రాఘవేంద్ర, వడ్డె నారాయణ, వీరారెడ్డి, మంగలి వెంకటేశ్, కురువ మల్లికార్జున, రాము, అందే భీమేష్, రమేష్, శ్రీరాము, గురుప్రసాద్, నీలకంఠ, సునీల్, ఫణీంద్ర, పవన్‌కుమార్, రాము, చక్రవర్తి, ప్రాణేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని సోమప్ప నగర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విశ్వహిందూపరిషత్, శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోమప్ప నగర్ నుండి శ్రీనివాస సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్, ఓం శాంతి సర్కిల్ నుంచి సోమప్ప నగర్‌కు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కళ్యాణ్, నరహరి, ఉరుకుందు, బండారవి, జెట్టప్ప, శివ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమైన నందవరం అయ్యప్పస్వామి ఆలయంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా జరిగాయి. అనంతరం స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కోసిగిలో..



కౌతాళంలో..

బంగారమ్మకు బోనాల సమర్పణ



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న దివాకర్ రెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో బంగారమ్మ, దేవమ్మ గ్రామ దేవతల దేవర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మంచాల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి వేర్వేరు సమయాల్లో అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దేవర కమిటీ నాయకులు జెట్టి నరసింహులు, యాగంటి వీరేష్, గొర్రెల హనుమంతు, చింతల కరెప్ప, బొజ్జప్ప, కడిచట్ల వెంకప్ప మూలింటి హనుమంతప్ప, అయ్యన్న, ఆంజనేయ, ముకిడప్ప, జడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మేకల సుజాత, ఎంపీటీసీలు మజ్జిగ నరసమ్మ, జయలక్ష్మి, రోగెప్ప, రవిరెడ్డి, వెంకోబ, మజ్జిగ బొజ్జప్ప, శివ, జెట్టి వీరేష్ పాల్గొన్నారు.

గుంటూరులో వలస కూలీ మృతి



నాగేష్ (ఫైల్)

కౌతాళం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు ట్రాక్టర్ పై నుంచి పడి హెచ్ నాగేష్(28) అనే వలస కూలీ మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలోని బాలెమర్రులో బుధవారం ఉదయం జరిగింది. మృతుడిది కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద ఉన్న సులకేర గ్రామంగా స్థానికులు తెలిపారు. సుమారు రెండు నెలల క్రితం మిర్చి కోతల కోసం బాలెమర్రు గ్రామానికి ఇతర కూలీలతో కలసి వచ్చాడని, బుధవారం ఉదయం 9 గంటల సమయంలో బాలెమర్రు నుంచి ట్రాక్టర్ ఫుట్ రెస్ట్ పై నిల్చొని పొలాలకు వెళ్తుండగా ప్రమాద వశాత్తు జారి పడి తీవ్రంగా గాయ పడ్డాడని, చికిత్స కోసం క్రోసూరు తీసుకు వస్తుండగా మరణించినట్లు స్థానికులు తెలియ జేశారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. క్రోసూరు ఎస్ఐ నాగేందరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియ జేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మంత్రాలయం వాసి అదృశ్యం



శంకరస్వామి

మంత్రాలయం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు వెళ్లిన మంత్రాలయం వాసి శంకర స్వామి అనే వ్యక్తి అదృశ్యమయ్యారు. బంధువులు, తోటి యాత్రికులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 12న పెద్దకడుబూరు మండలంలోని బసలదొడ్డి, మంత్రాలయం నుంచి ఎనిమిది మంది బస్సు తీసుకుని ఆయా తీర్థయాత్రలను దర్శించుకుంటూ వెళ్లారు. ఈ నెల 16న ఉదయం శంకరస్వామి ఓంతేశ్వర వద్ద నర్మదా నది ఒడ్డున ఆపి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బస్సులోనే నగదు, బట్టలు, సెల్‌ఫోన్ పెట్టి కిందకు వెళ్లాడు. ఎంతసేపటికి రాకపోవడంతో అక్కడున్న పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ ఫుటేజీలో ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంత్రాలయంలోని బంధువులకు సమాచారం ఇచ్చారు.

'హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి'

మంత్రాలయం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో వెట్టిచాకిరి పనులు చేయిస్తున్న హెచ్‌ఎం హంపయ్యను సస్పెండ్ చేసే వరకు పోరాటం చేస్తామని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్, మండల కార్యదర్శి రాజు అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశా లలో విద్యార్థులతో వెట్టిచాకిరి పనులు చేయించకూడదని ఆదేశాలు ఉన్న ప్పటికీ హెచ్‌ఎం విద్యార్థులతో పని చేయించారన్నారు. హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రోడ్లపై ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దివాకర్, అరుణాచల్, వీరేష్, విజయకుమార్, వినోద్, విజయ్ పాల్గొన్నారు.

'గ్యారేజ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గ్యారేజ్‌లో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, సురేష్, డిపో కార్మికులు రాజు,అనీఫ్,రసూల్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎం నాయకుడిపై చర్యలు తీసుకోవాలి'

పెద్దకడుబూరు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): తనకు నకిలీ ఇంటి పట్టా అంటగట్టి మోసగించిన సీపీఎం నాయకులు పరమేష్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని బాధితుడు పెద్దకడుబూరు నరసింహులు కోరారు. బుధవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు నరసింహులు మాట్లాడుతూ తన ఇంటికి వచ్చిన సీపీఎం నాయకుడు కమ్మరి పరమేష్ ఇంటి స్థలం ఇప్పిస్తానని రూ.2.80లక్షల తీసుకున్నాడ న్నారు. తనకు పెద్దకడుబూరులోని సర్వేనెంబర్ 377లో 10సెంట్ల స్థలానికి పట్టాలు ఇచ్చాడన్నారు. తనకు పట్టా మంజూరు చేశారని స్థలాన్ని చూపించాలని తాను తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను కోరగా పరిశీలించి ఇవి నకిలీ పట్టాలని, ఆ సర్వేనెంబర్ కూడా చెరువుకు సంబంధించిందని తెలిపారన్నారు. దీంతో తనకు పట్టాలు ఇచ్చిన పరమేష్‌ను కలిసి నా డబ్బులు నాకు ఇవ్వాలని కోరగా తనను చంపుతానని బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసు అధికారులు స్పందించి విచారణ జరిపి తనకు న్యాయంచేయాలని కోరాడు.

32 ట్రాక్టర్ల పశుగ్రాసం విరాళం

మంత్రాలయం,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు రాయచూరు, శిరుగుంపకు చెందిన రైతులు 32 ట్రాక్టర్ల పశుగ్రాసం విరాళం ఇచ్చిన ట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ బుధవారం తెలిపారు. విరాళం ఇచ్చిన రైతులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, శ్రీపాద ఆచార్, గిరిధర్ పాల్గొన్నారు.

'యజమానులపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని కోళ్ల ఫారం, చికెన్ సెంటర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి నాయకుల ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధితో మృతి చెందిన కోళ్లను బహిరంగ ప్రదేశాలలో పడేయడం సరికాదన్నారు. న్యూఎస్సీ కాలనీలోని కోళ్ల ఫారాల యజమానులు వ్యర్థాలను వంకలోనే వేయడం వలన దుర్వాసనతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కమిషనర్ గంగిరెడ్డికు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు, బాబు, నరసింహులు, యువరాజు, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఇంట్లో చోరీ

మంత్రాలయం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ నాగమ్మ ఇంట్లో బుధవారం సాయంత్రం చోరీ జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం.. మంత్రాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన సమావేశానికి వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా, తలుపులు తెరుచుకోని ఉండడం గమనించింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగలగొట్టి 10 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకొని వెళ్లారు. చోరీ జరిగిన విషయం మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రామాంజులు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. గురువారం ఉదయం క్లూస్‌టీం ద్వారా వేలి ముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

'విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి'

కౌతాళం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. కౌతాళంలో ప్రతిభ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టెక్నాలజీని మంచికి మాత్రమే ఉపయోగించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సైబర్ నేరాలు, యూటీజింగ్ గురించి వివరించి వాటి వల్ల కలిగే దుష్ప్రచారాలను గురించి తెలపాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, ఆర్గనైజరు మైనుద్దీన్‌లు ఉన్నారు.